# ప్రళయంలో ప్రణయం

## శ్రీమతి జె. వెంకుబాయమ్మ

అప్పుడే స్కూల్లో లాస్ట్‌బెల్ కొట్టారు. బిల బిల్లాడుతూ పిల్లలందరూ బయటికివచ్చారు కొందరు గ్రౌండులో ఆడుకునేందుకు, కొందరు ఇళ్లకు వెళ్లిపోయారు. ఇంకా మిగిలినవారు డిబేటింగు హాలువైపు నడిచారు ఒక ప్రక్క మగ పిల్లలూ, మరో ప్రక్క ఆడపిల్లలూ కూర్చున్నారు. కానీ ముఖ్యమైన హేమా హేమీలు మటుకు అప్పుడే హాలులో అడుగెట్టారు. వారిలో ఆడ వారికి లీడరు రాగిణి. మగవాళ్లకు లీడరు రాజా. వారిద్దరూ ఆవిధంగా ఉండటానికి కూడా కొంత కారణం వుంది. ఆడపిల్లలంటే తగని కోపం, చికాకు రాజాకి, మగవాళ్లంటే తగనికోపం చిరాకు రాగిణికి. వాళ్లిద్దరికీ పచ్చగడ్డివేస్తే భగ్గున మండేంత కోపం. మగవాళ్లంతా మోసకారులని అందులో ఆడవాళ్లను తియ్యటి కబుర్లు చెప్పి బుట్టలో వేసుకుని, వాళ్ల జీవితాలను నాశనం చేసిన వాళ్లు అనేకమంది ఉన్నారని, అందుకని మగవాళ్లనునమ్మకూడదనే దురభిప్రాయం కొన్ని కొన్నిసంఘటనలవలన ఆమెకు బాగాతలకెక్కింది. అందుకే ఆమెకు మగపిల్లలంటే కోపం. అందుకు వారిద్దరూ చెరోపార్టీకి నాయకులుగా ఎన్నుకోబడ్డారు. వీరకోసమే నిరీక్షిస్తున్నారు ఆ హాలులోని పిల్లలు.

ఆ రోజున డిబేటింగులో "స్త్రీకి విద్య అవసరమా? కాదా?" అనే సబ్జక్టుని గురించి మాట్లాడాలి. క్లాస్ టీచర్ లేచి బోయస్ అండ్ గరల్స్ మీలో ఎవరైనా సరే ఈ సబ్జక్టుని గురించి చక్కగా వినసొంపుగా వుండేట్లు ఓ పదిముక్కలు చెప్పండి అన్నాడు. ముందు కొందరు మగవాళ్లు లేచి ఏదో పెళ్లి చదువులకు, ఆకలిపద్దులకుసరిపడు విద్యకంటే ఆడవాళ్లకు ఎక్కువ విద్య వుండటం అనవసరమనీ, బాగా చదూకున్నకొద్దీ వాళ్ళకు అహంభావం ఎక్కువవుతోందని, మొగుళ్లనూ, సంసారాలను విడచి వాళ్ల లెక్కలేకుండా వీళ్లిష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని, స్త్రీలకు విద్య అనవసరం అని చెప్పారు. మరి కొందరు స్త్రీలకు ఈ రోజుల్లో ముఖ్యంగా విద్యే అవసరమని, విద్య లేనివారు వింత పశువులనీ, మగవానితో సరిగ్గా ఆడది కూడా విద్యాధికురాలు కావాలని, ఒకరిమీద ఆధారపడకుండా తనకాళ్లమీద తాను నిలపడ గలిగే శక్తి ఆమెలో కూడా వుండాలని చెప్పారు. అట్లా కొందరు చెప్పిన తరువాత రాగిణి లేచి వేదిక మీదకువచ్చింది. గాంభీర్యమైనకంఠాన్నెత్తి చెప్పటం మొదలు పెట్టింది. ప్రతి స్త్రీకి కూడా తగినంత విద్య అవసరం. ఎందుకంటే సంసార బాధ్యతలలో నైతేనేమి, విజ్ఞానం కొరకైతేనేం, స్త్రీకి వాళ్లనిగురించి కొంతమంది మరీ నీచంగా మాట్లాడేరు. అది తప్పు. యీ చదువుకున్న మగాళ్లు మటుకు తక్కువ వాళ్లా. తమ చెప్పు చేతల్లో ఎంత అణగి మణగి వున్నా ఆడువారు తమకు బానిసలనే దురభిప్రాయంతో వారిష్టమొచ్చినట్లు తిరుగుతూ పైగా పెళ్లైనా కొంచెం సముదాయిస్తే, ఇక వాళ్ల ముఖం చూడకుండా వదలివేసే వాళ్లూ, పెళ్లికాని పిల్లల్ని మోసం చేసి వాళ్ల జీవితాలు పాడు చేసేవారు అనేకమంది వున్నారు. అందుచే ఆడవాళ్లను అతినీచంగా చూడకూడదు. ప్రతివారిలోను కొన్ని కొన్ని లోపాలు వుంటాయి.

ముఖ్యంగా యీకరువు రోజుల్లో చూడండి మధ్య తరగతి కుటుంబాలలో సంసారాలు గడపటం చాలా కష్టంగా వుంటుంది. సంపాదించేవారు తక్కువ, తినేవారు ఎక్కువ. మరికొన్ని చోట్ల ఒక్కో తండ్రికి అంతా ఆడపిల్లలే. ఉండచ్చు అటువంటప్పుడు ఆ సంసారం ఎంత కష్టమో ఆలోచించండి. మరోచోట విధవలైన స్త్రీ వుండవచ్చు. లేక భర్త విడిచి పెట్టేసిన స్త్రీ వుండవచ్చు. అటువంటి వారి జీవితాలు ఒకరిమీద ఆధారపడవలసినదే కదా. అటువంటి వారికి ఒకళ్ల దగ్గర పని చేసి నీచంగా బ్రతుకలేరు. ఎటూ కాకుండా త్రిశంకు స్వర్గంలా వుంటాయి వాళ్ల బ్రతుకులు. అటువంటి సమయాల్లో ఆ స్త్రీలకు నిజంగా విద్యే కనక వుంటే ఆవిధంగా, అనాధలుగా, నీచంగా బ్రతుకవలసిన కర్మ ఎందుకొస్తుంది. డబ్బుకోసం కళావంతులే కాకుండా అనేకమంది స్త్రీలు తమ శరీరాలను అమ్ముకు బ్రతికేవారుకూడా లేకపోలేదు.

ఇంకా ఇప్పుడే స్త్రీకి విద్య చాలా తక్కువ. ఆదికాలం నుంచి, పురాణకాలం నుంచీ కూడా ముఖ్యంగా 16 ఏండ్లు వచ్చేలోపుననే సమస్త విద్యలూ చెప్పించేవారు. అందుకనే అప్పటి రోజులలో యుద్ధాలలో కూడా పాల్గొనే ఝాన్సీ, విజయలక్ష్మి, వీరాబాయ్ మొదలగు వారున్నారు. శ్రీకృష్ణుడు నరకాసురునితో యుద్ధంచేస్తూ అలసిపోతే అతని భార్య సత్యభామ విల్లంబులు పట్టి ఆయనకు సహాయపడింది. అదేవిధంగా భర్తకైనా, తల్లితండ్రులకైనా తమ సంసారాలలోనైనా ప్రతిస్త్రీ, పురుషునితో సమానంగా చదువుకుని సమానంగా సంపాదించ గలిగిననాడు సంసారాలూ, జీవితాలూకూడా ఆనందంగా సుఖంగా సాగిపోతాయి. ఇటువంటి బాధలు చాలామటుకు తొలగిపోవాలంటే కూడా ప్రతి స్త్రీకి ముఖ్యంగా విద్య అవసరమని నేను నొక్కి చెప్తున్నాను. నే చెప్పిన వాటిలో లోపాలేవైనా ఉంటే క్షమించి వాటిని సరిదిద్దుకోవాలని కోరుతున్నా"నంటూ రాగిణి వేదికదిగి తన సీటులోకి వచ్చి కూర్చుంది.

కరతాళధ్వనులు మిన్నులు ముట్టాయి. "ఆమె వయస్సున చిన్నపిల్లైనా, ప్రజలలో చాలా మంది ఏవిధంగా డబ్బుకోసం బాధపడుతున్నారో, ముఖ్యంగా నిరాధారులైనవారూ, స్త్రీలూ, ఎంత నీచస్థితికి జారుతున్నారో, జారత్వానికి, చోరత్వానికి ఏవిధంగా దాసులవుతున్నారో కూడా బాగా అర్థంచేసుకుని మరీ చెప్పింది రాగిణి. వీటన్నిటికీ కూడా ముఖ్యకారణం స్త్రీకి విద్య అనే దివ్య భూషణం లేకపోవటం వల్లనే అని చెప్తోంది. రాగిణి, ఆమె చెప్పినదంతా నగ్న సత్యం. ఆమె చెప్పింది పదిముక్కలే ఐనా చక్కని పాయింట్లు వేసి స్త్రీకి ముఖ్యంగా విద్య ఎంతో అవసరమని చెప్పింది. మా అందరికి చాలా సంతోషమైంది. ఈనాడు హెడ్‌మాష్టర్‌గారు ఆమెకే ఫస్టుమార్కునువేసి ఫస్టుప్రైజు ఇవ్వదలుచుకున్నారు"...అంటూ క్లాస్ టీచర్ రాగిణిని పిలిచి ఓ చిన్న బంగారు మెడల్‌ను బహూకరించారు. సెకెండ్‌ప్రైజు రాజుది. అటుపైని పెద్ద పరీక్షలు జరిగాయి. ఆఖరి రోజున అందరూ సర్దాగా టీ పార్టీలూ, నాటకాలు జరిపించారు. ఆ యస్.యస్.యల్.సి పరీక్షలతో చాలామంది ఆవూరునూ, ఆస్నేహితులనూ విడువలేక బాధగా భారంగా తరలిపోయారు.

వారిలో రాగిణీ—రాజా కూడా వున్నారు. అంతవరకూ ఒకరిపై ఒకరికి చిరుకోపాలువున్నా ఆక్షణంలో అవి మంచుగా కరగిపోయాయి. ఒకరిని విడచి ఒకరు దూరంగా వెళ్లిపోతున్నాం అనే బాధ వారి నయనాల్లో వ్యక్తమైంది. రాజా వుండబట్టలేక "రాగిణి మా వూరు వెళ్లిపోతున్నా. మనిద్దరికీ ఒకరిపై ఒకరికి ఎంతచిరుకోపాలున్నా అదే నాకు ఎంతో ఆనందంగా ఉండేది సుమా! ఈనాడు ఈస్కూల్‌ని, స్నేహితులనూ, ఆటపాటలనూ, నిన్నూ, నీకోపాన్ని విడచి వెళ్లిపోవాలంటే ఏదో భరింపరాని బాధగావుంది నామదిలో రాగిణి. గడచిన సుఖాంతాలు తిరిగిరావు కదా! అంటూ రాజా ఎంతో బాధపడ్డాడు. "రాజా! నామీద నీకు నిజంగా కోపంలేదా? నాకూ ఎంతో బాధగా వుంది. నిన్ను విడచి వెళ్లిపోతుంటే" అన్నది అమాయకంగా. ఇద్దరూ కొంతసేపు కబుర్లు చెప్పుకున్నారు. ఒకరి అడ్రస్ ఒకరు తీసుకున్నారు. భారంగా, బాధగా ఎవరి స్వస్థలాలకు వారు వెళ్లిపోయారు.

8 సంవత్సరాలు కాలగర్భంలో లీనమైపోయాయి. అప్పుడే మెయిల్ విజయవాడ

స్టేషన్ విడచిపెడ్తోంది. ఇంతలో ఎవరో 20 సంవత్సరాలు దాటిన ఓ చక్కని యువతి క్లాస్ కంపార్టుమెంటు లోకి ఓ జంప్ చేసింది. అందులో నున్నవారు ఏపెళ్ళినించైనావస్తున్నారో ఏమో గుర్రెట్టి నిద్రపోతున్నారు. ఓ బెర్తు మీద ఒకతను పెట్టె, బెడ్డింగు పెట్టి కాళ్ళు సాచుకుని పడుకుని, ఏదో పుస్తకం తిరగేస్తున్నాడు. ఆమెకు ఎక్కడా చోటులేదు కూర్చునేందుకు. లెదర్‌బాగును ఓ ప్రక్కనపెట్టి, ఓకిటికీ దగ్గరకు పోయి బయటకు చూస్తూ నిలుచుంది. కొండలు, చెట్లు, పుట్టలు అన్నీ వేగంగా వెనక్కు పోతున్నాయి. ట్రైను ముందుకు దూసుకు పోతూంది. ఒకటి,రెండు స్టేషన్‌లు దాటాయి. కొందరు దిగారు. మరి కొందరు ఎక్కారు. కాని అతను మటుకు కదల కుండా మెదలకుండా అట్లాగే పడుకున్నాడు. నిల్చుని, నిల్చుని కాళ్ళు నెప్పులుపుట్టాయ్ ఆ యువతికి. అదంతా గమనిస్తూనే ఉన్నాడు ఆ యువకుడు. తనలో తనే నవ్వుకున్నాడు ఆమె అవస్థకు. ఆమె మెల్లగా అతన్ని "ఓ .మిస్టర్! కాస్త లేచి కూచుందురూ కాళ్ళు పీక్కుపోతున్నాయ్" అంది.

అతను మాట్లాడలేదు.

"మిమ్మల్నే సార్! చెముడు ఏమిటి కొంపతీసి" అంది. దానికి సమాధానం లేదు. ఎక్కడో మొండి ఘటంలా ఉన్నాడే అనుకుంది. ఇంతలో టిక్కెట్టు కలక్టర్ లోనికి వచ్చాడు. "ఏమండీ చోటులేక కూర్చోటానికి చస్తుంటే పెట్టెలు అవీ కూడా బెర్తుమీద పెట్టి సాచుకు పడుకోవటం చదువు కున్న పుర్యాషుల లక్షణమేనా?"అంటూ అతన్ని అడిగి , ఆ యువకుని పెట్టే, బెడ్డింగు తీసి క్రింద పెట్టి అక్కడ తను కూర్చుంది. "ఏ స్త్రీ కూర్చోటానికి చోటులేక నిల్చుని ఉంటే మీరల్లా పెట్టెలూ బుట్టలూ పైన పెట్టటం చాలా తప్పండీ" అని అతన్ని మందలించి వెళ్ళి పోయాడు టికెట్టు కలెక్టరు.

"ఓ అపరిచితుని, అతని అనుమతి లేకుండా అతని వస్తువులు తీసి క్రింద పారేయటం చదువు కున్న ఆడపిల్ల లక్షణమేనా ఐతే ఇది?" అంటూ ఆమెవైపు కోపంగా చూశాడు. అతను పెట్టు కున్న కళ్ళజోడు తీసి ఓసారి వెల్‌వెట్‌క్లాత్ పీస్‌తో తుడిచి మళ్ళా పెట్టుకో పోతున్నాడు.

ఇంతలో అతనివైపు చిటచిట లాడుతూ చూస్తున్న ఆ యువతి ముఖంలో చిరునవ్వు చిందింది. "హల్లో! రాజా! నువ్వా!! కళ్ళకు జోడూ అదీ ఉంటే ఆనవాలు కట్టలేక పోయాను సుమా! చాలా మారిపోయావ్!" అంది.

అతను అంతకు ముందే ఆమెను ఆనవాలు కట్టాడు. కాని అతనికి అదో సర్దా. "ఏ... ఎస్ రాగిణీ నువ్వా! అరె నువ్వు బాగా మారిపోయావ్. అబ్బా! ఎంత ప్రళయాన్ని లేవతీశావ్ రాగిణీ, నువ్వుని నాకు తెలవ లేద !' అన్నాడు. "అబ్బా! తెలుసుండే ఆడేవన్నమాట ఈ నాటకమంతా" ఇప్పుడేం చేస్తున్నావు రాజా నువ్వు? ఇట్లా ఎక్కడికి పోతున్నావ్?"

"రాజమండ్రీలో కొంచెం పనుండి పోతున్నా నువ్వెందాకా?"

"నేనూ అక్కడికే రాజా, క్షేమంగా ఉంటున్నావా? అబ్బ! ఎన్నాళ్ళయింది నిన్ను చూసి!" అంటూ అనేకమైన మాటలు వీరిద్దరి మధ్యా దొర్లిపోయాయి. ఇంతలో నిడదవోల్ స్టేషన్ వచ్చింది.

అక్కడ మారి రాజమండ్రి పోయే ట్రైన్ ఎక్కారు. ఇద్దరికీ టిఫిన్ తీసుకొచ్చాడు రాజా. ఇద్దరూ సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్ ఆరగించారు. స్టేషన్ రావటంతోటే ఇద్దరూ దిగారు. ఇద్దరూ ఒకరి క్షేమాలు ఒకరు తెలుసుకుని చెరోవైపూ బయలుదేరారు.

అతనితో రాగిణికి కాస్త స్నేహం ఐతే ఉంది గాని , లతనేం చేస్తున్నాడో, ఎక్కడ వుంటున్నాడో, అతని తల్లిదండ్రులెవరో ఇప్పుడైనా అడగలేదు. తన తెలివి తక్కువను తనలో తనే నిందించుకుంది. ఆమె ప్రస్తుతం చదువైపోయి కాలేజీలో లెక్చరర్‌గా వుంటోంది. తన వైనం కూడా ఆమె అతనికి చెప్పలేదు. ఇంటికి వెళ్ళిన రాగిణికి పిడుగులాంటి వార్త ఎదురైంది. ఆమె తల్లికి అంత్రకితమే పక్షవాతం. ఇప్పుడు మరి లేవలేని స్థితికి వచ్చింది. అందుచే రాగిణి అనుమతి లేకుండానే ఏ మంచి సంబంధం వస్తే అది కుదిర్చారు. పెళ్ళికొడుకు ఎం. బి. బి. యస్. చదివి సర్జను చేస్తున్నాడు ప్రస్తుతం. పిల్ల చదువు కున్నదీ, స్వతంత్ర భావాలు కలదీ, అందమైనదీగా ఉంటే చాలు తనకి కట్నం ఏమీ ఇయ్యక్కరలేదన్నాడు. పిల్లవాడుకూడా తెల్లగా అందంగా, భారీగా బావున్నాడు. పేరు రాజారావు. ఇద్దరూ అనుకూల దాంపత్యంగా ఉన్నారని కూతుర్ని అడగకుండానే రాగిణి తండ్రి ఈ సంబంధాన్ని స్థిరపర్చాడు.

రాగిణి ఈపెళ్ళి నాకు ఇష్టంలేదని అనేకవిధాల తల్లితో చెప్పి ఏడ్చింది. "అతనూ నీకు ఎందులోనూ తీసిపోడమ్మా రాగిణీ! నువ్వు అతన్ని చూడక పోవటంచేత అట్లా అంటున్నావు. మేము నీకేం అన్యాయం చేయటంలేదమ్మా. అందరకూ నచ్చింది ఈ సంబంధం.

ముహూర్తం కూడా నిర్ణయమైన ఈ పెళ్ళి ఆగిపోతే అంతకన్నా అగౌరవం మన కింకొకటి లేదమ్మా", అంటూ కళ్ళ నీళ్ళు ఒడుపుతున్న తల్లిని చూసి, తన కిష్టంలేని ఆపెళ్ళికి ఒప్పుకుంది. తన జీవితంలో ఏ నూతనాధ్యాయం ప్రారంభ మవుతుందనీ, తన కొక నూతనానందం వస్తుందనే సంతోషమే ఆమెకు లేకపోయింది. దిగులుతూ గడుస్తున్నాయి రోజులు.

ఆనాడే ఆమె వివాహం.

పెళ్ళి పందిరంతా తెల్లని చాందినీతోటి, కాగితం పువ్వులతోటీ, బుట్టలతోటీ, రంగు రంగుల విద్యుద్దీప కాంతులతోటీ, పచ్చటి మామిడి తోరణములతోటీ, కలకల్లాడుతూ రంగురంగుల వస్త్రములు ధరించిన యువతీ యువకులతోటీ ఎంతో అందంగా కన్నుల పండువుగా నుంది.

మేళ తాళాలు మిన్ను ముట్టాయ్. మగ పెళ్లి వారు వచ్చారు. మధ్య అందంగా అరటి చెట్లతో రంగురంగుల పువ్వులతో కట్టిన మంటపంలో వధూవరులను ఆశీనులను చేశారు. రాగిణి వరుని వైపు చూడనైనా చూడలేదు. తను అనుకున్నవాడు భర్తగా లభించకపోయిన తరువాత ఎవరైతే నేం అనుకుని బాధతో కళ్ళనీళ్ళు వత్తుకుని తలొంచుకు కూర్చుంది. అంతే ఆమె మెళ్ళో మూడు ముళ్ళూ పడిపోయాయి.

ఆ మర్నాడే వారి జీవితాల్ని ఆనందమయం చేయగల తొలిరాత్రి. వారిద్దర్నీ ఓ గదిలోకినెట్టి తలుపు బంధించి చక్కా పోయారు ముత్తయిదువులు. వీరి బాధ వాళ్లకేం అర్థమవుతుందీ పాపం!

"ఓ క్షమిస్తున్నావా రాగిణీ. నీ అనుమతి లేకుండానే ఈ వివాహం జరిగిందని నాకిప్పుడే తెలిసింది. నన్ను క్షమించు రాగిణీ" అంటూ ఆ పెండ్లికొడుకు రాగిణివద్దకు వచ్చి, ఆమె చేతులు పట్టుకున్నాడు. "నీకిష్టంలేందే నిన్ను నిర్బంధించేంతటి మూర్ఖుణ్ణి కాను. ఐనా ఇట్లా బేలవలె ఏడ్వటం చదువుకున్న ఆడపిల్ల లక్షణమేనా ఇదీ" అన్నాడు.

"ఆ! ఆ గొంతూ! ఆమాట తను కొద్ది రోజుల క్రితమే వింది. ఐతే ఎవరితను! అంతటి విశాలహృదయుడు. లతని ముఖంవైపు చూసింది

ఆ! ఆశ్చర్యం! తన ప్రేమైక మూర్తి రాజా. "ఆ! రాజా! రాజా! నువ్వేనా రాజా! ఎంత అదృష్టవంతురాల్ని! ఈ సంగతి మొన్న ట్రైనులో ఎందుకు చెప్పావు కాదు. నీపేరు రాజారావా? నువ్వు ఎం. బి. బి. ఎస్. ప్యాసై సర్జన్ చేస్తున్నావా? మాటమాత్రమైనా అనలేదేం. అందుకే నేనెవరో అని పొరపడ్డాను. క్షమించు రాజా! నిన్నే నాటినుంచో నా హృదయంలో ప్రేమైకదైవంగా ఆరాధించుకుంటున్నా. నాకోర్కె నీతో చెప్పటానికి సిగ్గుపడ్డాను. భగవంతుడు కరుణామయుడు. అందుకే మనసారా ప్రేమించిన నిన్నే నా భర్తగా అనుగ్రహించాడు." అన్నది. ఇద్దరి జీవితాలు ఆనందంతో వుప్పొంగాయి. ★

